

### అన్నీ ఉన్నోళ్లకేనా..? మాలాంటోళ్లకు వద్దా..?

మాది కీచులాటపల్లి గ్రామం. నేను దివ్యాంగురాలిని. మాకు గుంట భూమి కూడా లేదు. చిన్న గుడిసెలో ఉంటున్నం. నాకు ఇద్దరు పిల్లలు. నా భర్త శంకర్ గొర్రెల కాపరి. రోజూ కూలీ చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నం. రేషన్ కార్డు కోసం దరఖాస్తు ఇచ్చిన. ఇందిరమ్మ ఇండ్లు కట్టుకుంటమని ఆఫీసర్లకు దరఖాస్తు పెట్టుకున్న. లిస్ట్‌లో నా పేరు లేదు. అన్నీ ఉన్నోళ్లకేనా..? మాలాంటి పేదోళ్లను పట్టించుకోరా..? జాబితాలో పేరు లేదని అధికారులకు మొర పెట్టుకుంటే మళ్లీ దరఖాస్తు పెట్టుకోవాలంటున్నరు. ఇంకెన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలె.

**- రేశవేని పద్మ, కీచులాటపల్లి (జూలపల్లి)**



### జాబితా తిరస్కరణ

ధరూర్ గ్రామసభలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జగిత్యాల రూరల్, జనవరి 22 : జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో గ్రామస్తులు ఇందిరమ్మ ఇండ్ల జాబితాను తిరస్కరించారు. జాబితాలో అనర్హులను ఎంపిక చేశారంటూ అభ్యంతరం తెలిపారు. మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామంలో సర్వే చేసి లిస్ట్ తయారు చేయాలని అధికారులను కోరారు.



ధర్మారం: మండల కేంద్రంలో మహిళలను వారిస్తున్న ఎస్‌ఐ

### కల్యాణలక్ష్మి, ఇందిరమ్మ ఇంటికి వసూలు చేసిన్రు : ఇరుగుదిండ్ల గోపాల్ -మమత

'బిడ్డ పెండ్లి చేసినం. కల్యాణలక్ష్మి చెక్కు ఇచ్చేందుకు రూ. 5వేలు అడిగిన్రు. ₹3వేలు ఇస్తేనే ఇచ్చిన్రు. మొన్న ఇందిరమ్మ ఇంటి దరఖాస్తు కోసం ఫొటోలు దించేందుకు, మంజూరు చేసేందుకు ₹500 పంచాయతీ సిబ్బంది వసూలు చేసిన్రు' అని జగిత్యాల రూరల్ మండలం మోరపల్లికి చెందిన ఇరుగుదిండ్ల గోపాల్- మమత దంపతులు ఆరోపించారు. తమను పంచాయతీ కార్యదర్శి, కారోబార్లు లంచం కోసం వేధించారంటూ గ్రామసభలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ విషయమై గ్రామ కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ, వారిని ₹5వేల లంచం అడగలేదన్నారు. గోపాల్ ₹5వేల ఇంటి పన్ను గ్రామ పంచాయతీకి చెల్లించాల్సి ఉందని, ₹3వేలు ఇచ్చారన్నారు. ఈ మేరకు రసీదు సైతం ఉందన్నారు. కాగా, గ్రామ పంచాయతీలో 9/10/2023న ఇరుగుదిండ్ల గోపాల్ పేరిట రాసి ఉన్న ₹5వేల రసీదును చూపించారు. అయితే గోపాల్- మమత దంపతులు మాట్లాడుతూ, తమ పేరిట ఇల్లే లేద తమకు ఇంటిపన్ను ఎలా వస్తుందని ప్రశ్నించారు.



జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో వసూళ్ల గురించి ప్రత్యేకాధికారికి వివరిస్తున్న మమత

# వెల్లువెత్తిన ప్రజాగ్రహం

## రెండో రోజూ గ్రామసభల్లో లొల్లిలొల్లి

ప్రజాపాలన గ్రామసభల్లో రెండో రోజూ ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఏ ఊరిలో చూసినా.. ఏ వార్డులో చూసినా తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. నాలుగు పథకాల అమలుపై బుధవారం ఉమ్మడిజిల్లాలో గ్రామ సభలు నిర్వహించగా.. అంతటా ప్రజలు నిరసన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులకు సంబంధించి అర్హుల పేర్లు చదువుతుండగా, ఎక్కడికక్కడ నిలదీశారు. తమ పేర్లు అధికారులు లేవని, అర్హుల ఎంపిక సరిగా జరగలేదంటూ విరుచుకుపడ్డారు. అసలు ఎవరిని అడిగి జాబితాలు తయారు చేశారంటూ ప్రశ్నలు సంధించారు. కొన్నిచోట్ల కన్నీరు పెడుతూ.. దండం పెడుతూ తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సంవత్సర కాలంగా రైతు భరోసా ఎందుకు ఇస్తలేరని, గ్యాస్ సబ్సిడీ వస్తలేదని, గృహజ్యోతి ఎందుకు అమలు కావడం లేదని ఆగ్రహించారు. దాంతో సమాధానం చెప్పలేక అధికారులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రశ్నించారు. ముందు జాగ్రత్తగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అడ్డుకునే ప్రయత్నం చేయడంపైనా మండిపడ్డారు. చివరకు కొన్నిచోట్ల అధికారులు జాబితాలు మొత్తం చదవకుండానే వెనుదిరిగారు.

**- కరీంనగర్, జనవరి 22(నమస్తే తెలంగాణ)**

- ఎక్కడికక్కడ నిలదీతలు.. నిరసనలు
- అర్హుల పేర్లు లేవంటూ మండిపడ్డ ప్రజలు
- ఎవరిని అడిగి జాబితాలు తయారు చేశారంటూ ప్రశ్నలు
- సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరైన అధికారులు
- పోలీస్ బందోబస్తుతో అడ్డుకునే ప్రయత్నంపై విమర్శలు



గ్యాస్ డబ్బులు వస్తలేవని అధికారులకు దండంపెట్టి వేడుకుంటున్న వృద్ధురాలు అచ్చవ్వ

### సార్ దండం పెడుత.. గ్యాస్ పైసలు పడ్తలేవు

ముత్తారం, జనవరి 22: 'గ్యాస్ సబ్సిడీ పైసల కోసం చాలాసార్లు దరఖాస్తు చేసుకున్న. అయినా పైసలు పడ్తలేవు. మీరైనా పడేటట్టు చూడండి' అంటూ ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన వృద్ధురాలు దేవునూరి అచ్చవ్వ గ్రామ సభలో అధికారులకు దండం పెట్టి వేడుకున్నది. సార్లు పట్టించుకోవాలని, తనకు సాయం చేయాలని కోరింది. అక్కడే ఉన్న ఎంపీడీవో సురేశ్ సమస్యను పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. అర్హత ఉండి.. లిస్టులో పేర్లు రానివారు, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా, ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- నారాయణపూర్ సభలో మహిళల ఆందోళన
- ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- పరిహారం ఎప్పుడిస్తారని ప్రశ్నల వర్షం
- మంత్రి ఒకింత అసహనం!
- మహిళలను సముదాయించిన అధికారులు



సభలో ప్రశ్నిస్తున్న మహిళలను వారిస్తున్న ఎస్‌ఐ అనూష

# మంత్రి ఉత్తమ్‌కు నిరసన సెగ!

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి చుక్కెదురైంది! గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ సభలో నిరసన సెగ తగిలింది. తమ సమస్యలు వినాలని ముంపుగ్రామాల మహిళలు కేకలు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్, జనవరి 22 (నమస్తే తెలంగాణ)/గంగాధర: ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామ సభల్లో పాల్గొనేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మొదట తిమ్మాపూర్ మండలం రేణికుంటకు వచ్చారు. సభలో పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా నారాయణపూర్ రిజర్వాయర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. విషయం తెలుసుకున్న నారాయణపూర్, దీని శివారు గ్రామం ఇస్త్రారిపల్లెకు చెందిన ముంపు బాధితులు తమ బాధలు చెప్పుకుందామని రిజర్వాయర్ కట్టపైకి వచ్చేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. మంత్రులు అక్కడి నుంచి నారాయణపూర్ గ్రామసభకు వచ్చారు. ఉత్తమ్ మాట్లాడుతుండగా, నారాయణపూర్, ఇస్త్రారిపల్లె గ్రామానికి చెందిన మహిళలు ఒక్కసారిగా లేచి కేకలు వేశారు. తాము నారాయణపూర్ రిజర్వాయర్ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, రిజర్వాయర్ నిండినప్పుడల్లా కంటిమీద కునుకు ఉండడం లేదని, ఎప్పుడేం జరుగుతుందో తెలియక భయాందోళన చెందుతున్నామని వాపోయారు. తమ గ్రామాలను తక్షణమే ముంపు గ్రామాలుగా ప్రకటించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటిస్తామని చాలా మంది ఇలాగే చెప్పి వెళ్లారని, తిరిగి రాలేదని నిలదీశారు. మరోసారి కేకలు వేశారు. నిర్వాసితులకు పరిహారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. దీంతో మంత్రి ఒకింత అసహనానికి గురయ్యారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతుండగా ప్రశ్నించిన మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా కుర్చీల్లో కూర్చోబెట్టారు. కేకలు వేస్తున్న మహిళల వద్దకు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ వెళ్లి మాట్లాడి సముదాయించడానికి ప్రయత్నించారు. చివరగా నారాయణపూర్‌ను ముంపు గ్రామం కింద తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. అధికారుల అత్యుత్సాహమో, కాంగ్రెస్ నాయకుల బల ప్రదర్శనో తెలియదుగానీ స్థానికులు మాత్రమే రావాల్సిన నారాయణపూర్ సభకు గంగాధర మండల వ్యాప్తంగా స్వశక్తి సంఘాల మహిళలను పెద్ద సంఖ్యలో తరలించడం విమర్శలకు దారి తీసింది. మంత్రుల టూర్ నేపథ్యంలో నారాయణపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, ఇతర మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులను పోలీసులు ముందుగానే అరెస్ట్ చేసి గంగాధర పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం విమర్శలకు తావిచ్చింది.



మహిళతో మాట్లాడుతున్న కరీంనగర్ జడ్పీ సీఈవో శ్రీనివాస్



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతుండగా ప్రశ్నిస్తున్న మహిళ



### వేదికపై కాంగ్రెస్ నేతలు

జమ్మికుంట 15వ వార్డులో అధికారుల పక్కన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షురాలు రేణుక

జమ్మికుంట టౌన్ (హుజూరాబాద్ టౌన్), జనవరి 22: జమ్మికుంట 15వ వార్డులో నిర్వహించిన సభలో అధికారులను ప్రజలు నిలదీశారు. వార్డుకు సంబంధం లేని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు వేదికపై ఎలా కూర్చొంటారని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ సభనా..? ప్రభుత్వ కార్యక్రమమా..? చెప్పాలని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. అలాగే 24వ వార్డులోనూ కాంగ్రెస్ నేతలు కూర్చోవడం విమర్శలకు తావిచ్చింది.

### ఊరి మొత్తంలో ఒక్క దళితుడూ లేడా..?

కమాన్‌పూర్, జనవరి 22: రొంపికుంట సభలో అర్హుల జాబితా చదవగా, దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఏ ఒక్క దళితుడి పేరు లేకపోవడంపై మండిపడ్డారు. అసలు ఈ జాబితాను ఏ ప్రాతిపదికన రూపొందించారని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం గ్రామ సభల పేరిట ఆగం చేస్తున్నదని ధ్వజమెత్తారు.



అధికారులపై ఆగ్రహిస్తున్న కొమురయ్య

### పేదలకు కాకుండా.. ఇంకెవ్వరికి ఇస్తరు?



నాకు గుంట భూమి లేదు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. కానీ, అర్హుల జాబితాలో నా పేరు రాలేదు. నాలాంటి పేదలకు కాకుండా ఇంకెవ్వరికి ఇండ్లు మంజూరు చేస్తరు? మాలాంటి వారిపై కనికరం చూపించి ఇండ్లు సాంక్షన్ చేయించండి.

**- గుడివందల బాలయ్య, రొంపికుంట (కమాన్‌పూర్)**

### గుంట భూమి లేకున్నా.. అర్హులం కాదా..?



..పక్క చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు ముదాం భాగ్య. ఈమెది పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామం. భాగ్య 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో 20రోజులకు పైగా పని చేసింది. వీరికి గుంట భూమి కూడా లేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అర్హుల జాబితాలో వీరి పేరు లేదు. జాబితాలో భూమి ఉన్నవారి పేర్లు వచ్చాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ జాబితాను ఎవరు తయారు చేశారని మండిపడింది. మొదలే రానప్పుడు.. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పథకాలు వస్తాయా? అంటూ గ్రామ సభ నుంచి వెళ్లిపోయింది.

**- ముదాం భాగ్య, గుండారం(కమాన్‌పూర్)**

# మోరపల్లిలో 'వసూళ్ల' రచ్చ

- ఇందిరమ్మ ఇండ్ల కోసం ₹500 వసూలు చేశారంటూ గ్రామస్తుల నిరసన
- మండల ప్రత్యేకాధికారి విచారణ
- కార్యదర్శి సస్పెండ్.. కారోబారిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు



మోరపల్లిలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న గ్రామస్తులు

జగిత్యాల, జనవరి 22(నమస్తే తెలంగాణ)/ జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామ సభలో రచ్చరచ్చ జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల సర్వే సందర్భంగా అర్జీదారుల నుంచి కారోబార్ శ్రావణ్‌కుమార్, కార్యదర్శి రాజిరెడ్డి ₹500 చొప్పున వసూలు చేశారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామంలో 521 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్జీలు ఇస్తే, 276మందిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేశారంటూ మండిపడ్డారు. అధికారులతో వాదనకు దిగారు. విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి డాక్టర్ బోనగిరి నరేశ్, ఇతర అధికారులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. కారోబార్‌కు, సఫాయిలకు ₹500 ఇచ్చామని అర్జీదారులు పెద్ద సంఖ్యలో వచ్చి వివరించారు. కొదుపుల భారతమ్మ, హుస్నేన్‌బీ, లింగంపెల్లి లక్ష్మి, ఇరుదిండ్ల తిరుపతమ్మ, వెంగళదాస్ లక్ష్మి తదితరులు తమ వద్ద పంచాయతీ సిబ్బంది డబ్బులు తీసుకున్నట్లు వాగ్మూలం ఇచ్చారు. అంతకుముందు సభ ప్రారంభంకాగానే, గ్రామంలో రేషన్ కార్డులు సరిగా మంజూరు చేయలేదని, అర్హులకు రాలేదని, అలాగే ఇందిరమ్మ ఇండ్లు సైతం మంజూరు కాలేదని, అధికారుల నిర్లక్ష్యవైఖరి వల్లే తమకు నష్టం జరిగిందంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 111 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 52 మందికి మాత్రమే మంజూరయ్యాయని, మిగిలిన వారికి ఎందుకు కాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఒకే ఇంటిపేరుతో 13 కుటుంబాలు ఉండగా, ఏడు కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ రైతు భరోసా పథకాల కోసం ఎంపిక చేశారని, ఇది ఎలా సాధ్యమంటూ ప్రశ్నించారు. వసూళ్ల పర్వానికి సంబంధించిన నివేదికను ప్రత్యేకాధికారి నరేశ్.. కలెక్టర్‌కు అందజేయగా, గ్రామ కార్యదర్శి రాజిరెడ్డిని సస్పెండ్ చేస్తూ.. కారోబార్ శ్రావణ్ కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### ఫోన్‌పే చేసిన

నేను ఎవుసం చేసుకొని బతుకుత. గ్రామంలో నాకున్న గుంటన్నర భూమిలో 3/61 నంబర్‌తో పాత ఇల్లు ఉంది. ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. 15 రోజుల కింద కారోబార్ శ్రావణ్‌కుమార్, సఫాయి ఇంటికి వచ్చిన్రు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఫొటో, స్థలం ఫొటో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పిన్రు. వివరాలు నమోదు చేయాలంటే బకాయి ఉన్న ఇంటిపన్ను ₹650 చెల్లించాలని, అలాగే ₹500 అదనంగా ఇవ్వాలని అడిగిన్రు. ఎందుకు అని అడిగితే ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడిగా వివరాలు నమోదు చేస్తామన్నరు. విధి లేని పరిస్థితుల్లో ఇంటిపన్ను ₹650, వాళ్లు అడిగిన ₹500 మొత్తం కలిపి ₹1150 ఫోన్‌పే చేసిన.



**- కారుకూరి గణేశ్, మోరపెల్లి**



గోపాల్‌పూర్‌లో వేడుకుంటున్న వృద్ధులు ఎముండ్ల కనకమ్మ, రేణుక

### మా దరఖాస్తు ఏమైంది?

సార్ నాకు గుంట భూమి లేదు. కాయ కష్టం చేసుకుని బతుకుతున్న. నేను మూడు సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. ఇప్పటి వరకు నా ఇంటి సర్వే చేయలేదు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రాలేదు. అసలు మేము ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తు ఏమైంది. మాలాంటి పేదోళ్లకు ఇందిరమ్మ ఇల్లు ఇయ్యరా సార్? నిరుపేదలకు ఇస్తమన్నరు మేం అర్హులం కాదా..?

**-ఎముండ్ల కనకమ్మ, గోపాల్‌పూర్**

### గోపాల్‌పూర్‌లో రసాభాస

కరీంనగర్ రూరల్, జనవరి 22: గోపాల్‌పూర్ గ్రామసభ రచ్చరచ్చగా మారింది. అర్హులందరికీ పథకాలు ఎందుకివ్వడం లేదు? కొత్త రేషన్‌కార్డులు ఎప్పటి నుంచి ఇస్తరు? స్థలం లేనివారికి ఇండ్ల స్థలం ఎప్పుడిస్తరు? గతం ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లు ప్రొసీడింగ్స్‌కు ఫలితం లేదా? అంటూ అధికారులను గ్రామస్తులు నిలదీశారు. కేసీఆర్ ఏం ఇచ్చారని కాంగ్రెస్ నేత సాయిని తిరుపతి అనడంతో, రైతుబంధు ఇవ్వలేదా..? అని బీఆర్‌ఎస్ నేత ఊరడి మల్లారెడ్డి సమాధానం ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇక్కడి నుంచి వెళ్లాలని కాంగ్రెస్ నాయకులు అనడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో గ్రామ సభ కాస్త రచ్చరచ్చగా మారింది.

### మా గోస చెప్పుకొనే అవకాశమివ్వలే..

నారాయణపూర్‌లో బుధవారం నిర్వహించిన సభ కాంగ్రెస్ పార్టీ మండల సభలా ఉన్నది. మా గ్రామానికి మంత్రులు వస్తున్నారు.. ఇగ మా కష్టాలు తీరుతయని సంబురపడ్డం. మంత్రులను కలువనీయకుండా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నరు. ముంపు బాధితులను ఇండ్ల నుంచి బయటికి కదలనివ్వలేదు. మా ఊరికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు మా గోస చెప్పుకొనే అవకాశమే ఇవ్వలె. అధికారుల తీరుతో మాజీ సర్పంచ్‌గా ఇబ్బందిపడ్డాం. కనీసం మంత్రులు మా ఊరికి వచ్చినా మా సమస్యలు పరిష్కారం కాలేదు.



**- ఎండీ నజీర్, మాజీ సర్పంచ్, నారాయణపూర్ (గంగాధర)**